క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కూడేరు: మండలంలోని అరవకూరులో సోమవారం ఉదయం 9:30 గంటలకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ దేవ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు హాజరు కావాలని వారు కోరారు.
గుమ్మఘట్ట: మండలంలోని మారెంపల్లిలో సోమవారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి ఆదివారాం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి


తమ్మయ్యదొడ్డిలో విత్తన శుద్ధి చేస్తున్న రైతులు

కుందుర్పి: విత్తనశుద్ధితో నాణ్యమైన పంట దిగుబడికి ఆస్కారముందని వ్యవసాయ అధికారి మహేష్ సూచించారు. ఆదివారం తమ్మయ్యదొడ్డిలో వేరుశనగ సాగుచేస్తున్న రైతులకు విత్తన శుద్ధి, వేరుశనగలో చీడపీడల నివారణ, భూసార పరీక్షలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పంటల సాగుకు ముందు విత్తనశుద్ధి తప్పనసరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రయాణం


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న డీఎం

ఉరవకొండ: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచల పుణ్య క్షేత్ర యాత్రకు ఆదివారం ప్రత్యేక సర్వీసులను డీఎం బాలాజీదయాల్ ప్రారంభించారు. 32 మంది ప్రయాణికులు బయలుదేరారు. డీఎం మాట్లాడుతూ ఈ నెల 3న అరుణాచలం నుంచి తిరిగి ఉరవకొండకు భక్తులు వస్తారన్నారు.

సీఎం జగన్‌తోనే రైతు సంక్షేమం


మాట్లాడుతున్న టి.రాజశేఖర్‌రెడ్డి

వజ్రకరూరు: రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలు అమలు చేశారని జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కమలపాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు చేసినంత మేలు మరే ప్రభుత్వంలోనూ జరుగలేదన్నారు. చాబాల గ్రామంలో 2021కి సంబంధించి అధికారుల అవగాహన లోపం, పొరపాటు కారణంగా బీమా మంజూరుకాలేదన్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్, రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే సా యంలో పొరపాటు జరగకుండా చూడాలన్నారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు


వజ్రకరూరులో స్వాగత ఏర్పాట్లు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శ్రీషిర్డి సాయి బాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్ఎల్‌వీ రాధాకృష్ణ తెలిపారు. వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.
కళ్యాణదుర్గం రూరల్: మైసూరు సర్వ ధర్మ ఆశ్రమ పీఠాధిపతి సద్గురు మమతమ్మ ఆధ్వర్యంలో స్థానిక సద్గురు అనర్వానంద బాబా ఆశ్రమ ఆవరణంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు జరుగనున్నాయి. ఈ మేరకు ఆదివారం ఆలయ కార్యనిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.
బెళుగుప్ప: మండలంలోని నక్కలపల్లి షిరిడీ సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ సేవా కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. సాయంత్రం 5.00 గంటలకు షిరిడీసాయిబాబా ఉత్సవ ఊరేగింపు ఉంటుందన్నారు. రాత్రికి రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.20,000,రూ.18,000, రూ.16,000 అందజేస్తామన్నారు.
వజ్రకరూరు: మండల కేంద్రంలోని షిరిడీసాయి ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు జరుగనున్నాయి. వేడుకలకు వజ్రకరూరుతో పాటుజిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్నారు.

కాలవ అండ.. దోపిడీ ఎజెండా!


కణేకల్లు మండలం రచ్చుమర్రి వద్ద తవ్వకాలు చేపట్టిన దృశ్యం (ఫైల్)


బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ వేదావతి హగరి వద్ద చింత వనంలో తవ్విన గోతులు (ఫైల్)


డి హీరేహాళ్ మండలం బీఐఐఓపీ వద్ద మట్టి తవ్వకాలు చేపట్టిన ఆనాటి ఆనవాళ్లు (ఫైల్)

- కణేకల్లు మండలంలోని రచ్చుమర్రి వద్ద వేదావతి హగరినే లక్ష్యంగా చేసుకుని టీడీపీ హయాంలో భారీగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. అక్కడి నుంచి ఎన్.హనుమాపురం వద్ద డంపింగ్ పేర్చి రాత్రికి రాత్రి టిన్‌వీలర్ లారీలు, టిప్పర్లలో ఇసుకను సరిహద్దును దాటించి రూ.కోట్లు గడించారు.
- బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ వేదావతి హగరి చింతవనంలో మొక్కల మధ్యనే ఇసుక తవ్వకాలు చేపట్టారు. ఈ కారణంగా చెట్లు వేర్లకు తేలి ధ్వంశమయ్యాయి. ఈ విషయంపై ఆనాడు తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి.
- డి హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం సమీపాన బీఐఐఓపీ ఫ్యాక్టరీ వద్ద ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా మట్టి కొల్లగొట్టి బెంగళూరు, బళ్లారి ప్రాంతాల్లోని వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకున్నారు.

- ఇసుక, మట్టి కొల్ల గొట్టింది ఆనాడే..
- వేదావతి హగరిలో నేటికీ వెక్కిరిస్తున్న నాటి ఆనవాళ్లు
- విప్ కాపుపై అంభాడాలు
- టీడీపీ నేతల తీరుపై సర్వత్రా విమర్శలు

రాయదుర్గం: టీడీపీ హయాంలో మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన కాలవ శ్రీనివాసులు అండతోనే.. రాయదుర్గంలో దోపిడీగా సాగిందనే విమర్శలు ప్రజల్లో నేటికీ వ్యక్తమవుతున్నాయి. ఇసుక, మట్టి తదితర ప్రకృతి సంపదను కొల్లగొట్టి రూ.కోట్లు దోచుకున్నారు. అక్రమాలపై ఆ రోజుల్లో కాలవ మానస పుత్రికగా చెప్పుకునే 'ఈనాడు'లో.. 'మంత్రి ఇలాకాలో కంత్రీల కులాసా' అంటూ పెద్ద అక్షరాలతో కాలవ అవినీతి భాగోతం వెలుగులోకి రావడం వెరసి ప్రజల్లో అభాసుపాలు కావాల్సి వచ్చింది. నియోజకవర్గంలోని కణేకల్లు మండలం రచ్చుమర్రి వేదావతి హగరిలో ఇసుక తవ్వకాలను కాలవ బినామీ కంపెనీకి చెందిన ఓ సంస్థకు కట్టబెట్టి నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టారనే విమర్శలు ఆ ప్రాంత ప్రజల్లో నేటికీ వినిపిస్తున్నాయి. అక్కడ తవ్వకాలు చేపట్టిన ఇసుకను ఎన్.హనుమాపురంలో డంప్‌గా పేర్చి రాత్రిళ్లు యథేచ్ఛగా బెంగళూరు, అనంతపురం, బళ్లారి తదితర ప్రాంతాలకు తరలించి రూ.కోట్ల సంపద వెనకేసుకున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ వేదావతి హగరి ఆకారం చెడిపోయేలా గుంతలు తవ్విన ఆనవాళ్లు కనిపిస్తూనే ఉన్నాయి. చింత-నిశ్చింత కింద నాటిన చింతచెట్లు ఇసుక తవ్వకాల దాటికి ధ్వంశం కావడంపై విమర్శలు వ్యక్తమౌతున్నాయి. అలాగే గుమ్మఘట్ట, రాయదుర్గం, డి హీరేహాళ్ ప్రాంతాల్లోనూ ఇసుక తరలించింది సొమ్ము చేసుకున్నారనే అభియోగాలు ఎట్టుచూసిన వినిపిస్తునే ఉన్నాయి. చాలా చోట్ల పోలీస్ కేసులు కూడా నమోదు కావడమే ఇందుకు నిదర్శనం.

కీలక నేత అండతోనే భారీగా మట్టిదోపిడీ..

టీడీపీలో ఆనాడు కీలక నేతగా చెప్పుకునే నాయకుడి కనుసన్నాల్లోనే మట్టి దోపిడీ ఓ రేంజ్‌లో సాగిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. టీ వీరాపురం చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండానే హిటాచీలు ఏర్పాటు చేసి 15 నుంచి 20 మీటర్ల లోతుకు మట్టి తవ్వకాలు చేపట్టారు. రాయదుర్గం సమీపాన నాన్‌చెరువు, డి హీరేహాళ్ మండలం ఓబుళాపురం బీఐఐఓపీ ఫ్యాక్టరీ వద్ద ప్రభుత్వ భూముల్లో మట్టిని కొల్లగొట్టారు. ఆ గోతులు నేటికీ కళ్లకు కట్టినట్టు దర్శనమిస్తుండడం విశేషం.

ఇసుక పాలసీలో నూతన సంస్కరణలు..

టీడీపీ శకం ముగిశాక 2019 లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఇసుక పాలసీలో నూతన సంస్కరణలకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. పేదలకు చౌకగా, ప్రామాణికంగా ఇసుక అందిస్తూ, ప్రభుత్వానికి ఆదాయం రాబట్టేలా కృషి చేశారు. ఈ కారణంగా రేణువంత కూడా సరిహద్దు దాటనీకుండా పటిష్ట చర్యలు చేపటి కట్టడి చేశారు. తప్పు చేస్తే అధికార పార్టీ వారైన సరే కేసులు నమోదు చేయిస్తూ జైల్లో పెట్టించారు.

నిందలు వేయడం వెన్నతో పెట్టిన విద్య..

పచ్చకామెర్ల వారికి లోకమంతా పచ్చగా కనిపిస్తున్నట్టు టీడీపీ హయాంలో దోపిడీ జరిగిన తీరులాగే ఈ ప్రభుత్వంలో కూడా చేస్తున్నారనే ఆరోపణలు చేయడం విడ్డురంగా ఉందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి విమర్శించారు. బస్సు యాత్రకు వచ్చిన టీడీపీ నాయకులు కొందరు 'కాలవతో కలసి ఆరోపణలు సంధించడం సరైంది కాదని ఖండించారు. ఇసుక, మద్యం దోపిడీకి కాలవనే బ్రాండ్ అంబాసిడర్ అనే విషయం గుర్తించుకోవాలన్నారు.

ఇసుక దోపిడీ వాస్తవమే



కణేకల్లు మండలంలోని రచ్చుమర్రి వద్ద టీడీపీ హయాంలో ఇసుక దోపిడీ చేసింది వాస్తవమే. రాత్రి,పగలు తేడా లేకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి ఎన్.హనుమాపురం వద్ద డంప్ చేసి అక్కడి నుంచి తరలించేవారు. ఈ వ్యవహారంలో టీడీపీ ముఖ్య నాయకుడి అండ ఉందనే విమర్శలు అప్పట్లో పెద్ద ఎత్తున వినబడ్డాయి. – చంద్రశేఖర్‌రెడ్డి, కణేకల్లు

టీడీపీ హయాంలో దోచేశారు



టీడీపీ హయాంలో ఇసుక, మట్టి ని కొల్లగొట్టి ఆధాయం కూడగట్టరనే ఆరోపణలు నేటికీ తగ్గలేదు. రచ్చుమర్రి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే కారణంగా అప్పట్లో టిప్పర్లను కూడా పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రభుత్వ కాంట్రాక్ట్ పనులకు తవ్వకాలు చేపడుతున్నారు.
– కురుబ మహేష్, కణేకల్లు

సంక్షేమ సారథి ముఖ్యమంత్రి జగన్

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి


బిదరకుంతంలో బుక్‌లెట్ అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి


పాల్తూరులో 'గడప గడపకూ మన ప్రభుత్వం' నిర్వహిస్తున్న విశ్వేశ్వరరెడ్డి

కణేకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఇంటి ముంగిటకే పథకాలను చేరుస్తూ సంక్షేమ సారథిగా నిలిచారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని బిదరకొంతం, ఎస్ఆర్ఎస్ క్యాంపులో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు హనుమంతప్ప, జేజేటీ మౌనిక, బిదరకొంతం వైస్ సర్పంచు బసవరాజు, నాయకులు జేజేటీ ప్రభాకర్‌రెడ్డి, పాటిల్ రామలింగారెడ్డి, జేజేటీ నగేష్ రెడ్డితో కలసి విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. విప్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోమారు జగనన్నను ఆశీర్వదించాలన్నారు. చంద్రబాబు కల్లబొల్లి మాటలతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తే జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. 2014 ఎన్నికల్లో 650 హామీలిచ్చి మోసం చేసిన చంద్రబాబు ఈ సారి సీఎం పదవిపై ఉన్న వ్యామోహంతో రెట్టింపు హామీలిచ్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. ఆల్‌ఫ్రీ బాబూను నమ్మితే తినే కంచంలో మట్టి వేసుకొన్నట్లేనన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌తో సమానంగా భావించి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, మండల అగ్రిబోర్డు చైర్మన్ ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, గ్రామ సచివాలయ కన్వీనర్ ఎర్రిస్వామి, నాయకులు సురేష్‌రెడ్డి, మనప్పాచారి, అంబాపురం భాస్కర్‌రెడ్డి, గెనిగెర గోపాల్, ఎస్.లోకేష్, విశ్వనాథ్‌గౌడ్, మంజునాథ, గోవర్ధన్‌రెడ్డి, మారెంపల్లి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

ఉరవకొండ(విడపనకల్లు): ప్రజా సంక్షమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం విడపనకల్లు మండలంలోని పాల్తూరు గ్రామంలో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం-1 పరిధిలో జరిగిన కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి విశేష ఆదరణ, స్వాగతం లభించాయి. మహిళలు హారతులు పడుతూ అడుగడుగునా పూలవర్షం కురిపించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరవేర్చారన్నారు. ప్రతి పథకాన్ని అర్హులైన లబ్ధిదారులకు అందిచారన్నారరు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనమంతు, సర్పంచ్ బీవీలారాణి, ఎంపీటీసీలు దాసరి లక్ష్మిదేవి, పాటిల్ విద్యాశ్రీ, నాయకులు కరణం భీమిరెడ్డి బసన్న, జరాజశేఖర్, సొసైటీ చైర్మన్ శ్రీరాములు, డిష్ వెంకటేసులు, శివ, షణ్ముఖగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

బొమ్మనహాళ్: మండలంలోని గోనేహాళ్ గ్రామంలో ఇరువర్గాల ఘర్షణ పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గోనేహాళ్ గ్రామంలో గ్రామానికి చెందిన వలిబాషా వర్గీయులు శ్రీధరఘట్ట గ్రామానికి చెందిన రామాంజనేయులు వర్గీయులు ఘర్షణ పడ్డారు. రామాంజినేయులు పొలం పక్కన ముస్లింలకు చెందిన శ్మశానం ఉంది. ఆ శ్మశానంలో వలిబాషాకు చెందిన కుటుంబసభ్యుల సమాధి వద్ద నల్ల బండను రామాంజినేయులు పగులగొట్టాడని.. పొలం వద్ద ఉన్న రామాంజనేయులతో గోడవ పడ్డారు. ఇరువురు మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. రామాంజినేయులకు వలిబాషా వర్గీయుల్లో ఒకరికి గాయాలయ్యాయి. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

వజ్రకరూరు: మండల కేంద్రంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని గుంతకల్లుకు చెందిన గోపీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు సర్పంచు మోనాలిసా ఆదివారం తెలిపారు. షిరిడీ సాయి దేవాలయం పక్కన ఉ దయం 8గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య అతిథులుగా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, ఎ మ్మెల్సీ వై.శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి తదితరులు హాజరవుతారన్నారు.

మండల కన్వీనర్ నియామకం


బోయ సర్వోత్తం కుమార్

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా శీబావికి చెందిన బోయ సర్వోత్తం కుమార్‌ను నియమించినట్లు మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయనను ఎంపిక చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అడుగుజాడల్లో నడుస్తున్న వారికి పార్టీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. మండల కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన మంత్రికి సర్వోత్తంకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయ పరుచుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా కార్యదర్శిగా గోళ్లకు చెందిన మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. పార్టీ కోసం పనిచేస్తున్న ఆయనకు సేవాదళ్ కమిటీలో చోటు కల్పించినట్లు మంత్రి తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి


పదోన్నతి పొందిన ఎంఈఓలను సన్మానిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: ప్రధానోపాధ్యాయులుగా విశేష సేవలందించి ఎంఈఓలుగా పదోన్నతి పొందిన వారు బడుగు, బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసం మరింతగా కృషి చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక ఆర్డీటీ ఎకాలజీ సెంటర్లో ఆదివారం పదోన్నతి పొందిన వారిని ఘనంగా సత్కరించారు. స్వేరోస్ నెట్‌వర్క్(లాయర్స్ ఫర్ సోషల్ జస్టిస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్), ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ రంగస్వామి హాజరయ్యారు. సన్మానం పొందిన వారిలో హెచ్ఎన్ తిప్పేస్వామి, డాక్టర్ రామచంద్ర, కృష్ణ నాయక్, హరికృష్ణ, ఓబుళపతి, శ్రీధర్, మల్లికార్జున, వాణీదేవి, బాబు, నాగమణి, విజయ కుమారి, మధన్ మోహన్, సాయికృష్ణ, ఎస్ఐ సుధాకర్ ఉన్నారు. కార్యక్రమంలో స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప, ఎంఈఓ ఓబుళపతి, నాగరాజు, మంజునాథ్, ఆర్డీటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

డబ్బు విషయమై వాగ్వాదం

కళ్యాణదుర్గం: డబ్బు విషయమై పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన పలువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సంఘటన ఆదివారం జరిగింది. కేసీ రుద్రన్న కుటుంబ సభ్యులు కొంతకాలం క్రితం విద్యానగర్‌కు చెందిన అనిత, ఆమె భర్త రామ్మూర్తికి సుమారు రూ.36 లక్షలు అప్పు ఇచ్చారు. డబ్బు చెల్లించాలని పలుమార్లు అడిగినా సమాధానం రాక పోవడంతో వివాదం మొదలైంది. అనిత, తోడికోడలు సునీత, సుబ్బమ్మతో కలిసి తోటలో పనిచేస్తుండగా కేసీ రుద్రన్న కుటుంబ సభ్యుల తరపున సురేష్, తిప్పేస్వామి, ఎర్రిస్వామి అనే వ్యక్తులతో పాటు పలువురు డబ్బు విషయమై నిలదీయగా ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఇరువురు రాళ్లు రువ్వుకున్నారు. దాడిలో రామ్మూర్తికి బలమైన గాయాలవడంతో అనంతపురానికి తరలించారు. అనిత, సునీతకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న కాలనీకి తాగునీరు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని జగనన్న కాలనీకి ఆదివారం సత్య సాయి తాగునీటిని అందించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల కృషి ఫలితంగా కాలనీలో ఉన్న కొళాయిలకు సత్య సాయి నీరు రావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట


గుమ్మఘట్ట: బీటీపీ గ్రామంలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు

రాయదుర్గంటౌన్: అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 22వ వార్డు మొలకాల్మూరు రోడ్డు సున్నపు బట్టీల వద్ద రూ.3.40 లక్షల జనరల్ ఫండ్స్‌తో కొత్త బోరు ఏర్పాటును కౌన్సిలర్ పెద్ద వన్నూరుస్వామితో కలిసి విప్ ఆదివారం ప్రారంభించారు. పట్టణంలో దశలవారీగా అవసరమైన చోట రోడ్లు, సీసీ డ్రైన్‌లు వేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్, కౌన్సిలర్లు పెద్ద వన్నూరుస్వామి, డిష్ గోవిందు, ఫకృద్దీన్, మంజునాథ, వార్డు ఇన్‌చార్జ్‌లు సునార్ ఇస్మాయిల్, గంగాధర్, గోరంట్ల సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్‌తోనే సుపరిపాలన

గుమ్మఘట్ట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని బీటీపీ గ్రామంలో ఆదివారం సీసీ రోడ్ల నిర్మాణానికి విప్ భూమి పూజ చేశారు. గ్రామంలో ఇటీవల నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సీసీ రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు ఆయనకు విన్నవించడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. ఆయన మాట్లాడుతూ జనం మెచ్చేలా సీఎం జగన్ పరిపాలిస్తుంటే టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. వివిధ కారణాల వల్ల ప్రభుత్వ పథకాలు అందకపోతే 'జగనన్న సురక్ష' పథకం ద్వారా లబ్ధిపొందేందుకు అవకాశం కల్పించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, బేలోడు సర్పంచ్ ఉమేష్, ఎంపీటీసీ గోవింద, కాంట్రాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ఆర్‌టీ కాంతారెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, నాయకులు నారాయణరెడ్డి, గిరిరెడ్డి, అంగడి తిప్పేస్వామి, గొల్ల ఈరన్న, హనుమంతు, దేవారాజు, గొల్ల హనుమంతు, డీలర్ వన్నూరుస్వామి, ఏకాంత, ఆంజనేయ, కెంగ తిప్పేస్వామి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కూడేరు: 1998–99లో 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం కూడేరు హైస్కూల్‌లో సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు. అనంతరం నాటి చిలిపి పనులు, జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకుంటూ, అక్కడే భోజనాలు చేసి సాయంత్రం దాకా సరదాగా గడిపారు.

లో ఓల్టేజీ సమస్యపై ఫిర్యాదు

కుందుర్పి: ప్రభుత్వ అనుమతి లేకుండా వందల సంఖ్యలో అక్రమ వ్యవసాయ కనెక్షన్లు అమర్చుకోవడంతో బెస్తరపల్లి, కుందుర్పి, అనుంపల్లి, ఎనుములదొడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో లోఓల్టేజీ సమస్యతో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుందుర్పిలో ఏఈ జయకృష్ణను కలసి అక్రమ కనెక్షన్లు తొలగించాలని రైతులు కోరారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన ర్యాలీ

వజ్రకరూరు: మండల కేంద్రంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచు మోనాలిసా, తహసీల్దార్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలలిత, గ్రామ కార్య దర్శి శ్రీధర్‌రావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు నల్లబోతులరాజు, పాలకవర్గ సభ్యులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' కార్యక్రమం రేపు

వజ్రకరూరు: మండల కేంద్రంలో మంగళవారం 'జగనన్న సురక్ష'పై ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సర్పంచు మోనాలిసా, గ్రామ కార్యదర్శి శ్రీధర్ రావు తెలిపారు. ఆదివారం వజ్రకరూరులో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ విజయలలిత తదితరులతో కలసి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాట్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి ప్రజలకు 11 రకాల సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

'జయం పురుషోత్తం సేవలు మరువలేనివి'

కళ్యాణదుర్గం: ఆర్యవైశ్య సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు జయం పురుషోత్తం సేవలు మరువలేనివని మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి అన్నారు. స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఆదివారం జయం పురుషోత్తం సంస్మరణ సభ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, గోదాదేవి, పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పలువురు హాజరై పురుషోత్తం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం కోసం ఆయన చేసిన కృషిని వారు గుర్తుచేసుకున్నారు.

పెన్షనర్లకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు

రాయదుర్గంటౌన్: పెన్షనర్లకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఎస్‌బీఐ మేనేజర్ మృత్యుంజయ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో జరిగిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు లావాదేవీల్లో పెన్షనర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ

రాయదుర్గం: పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు లో రూ.1.70 కోట్ల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సోమవారం ఉదయం భూమిపూజ చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, పార్టీ ముఖ్య నాయకులు హాజరు కావాలన్నారు.